క్లుప్తంగా

1 నుంచి ఇంటర్‌లో అడ్మిషన్లు

ఉండి: ఉండి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూన్ 1వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు హైస్కూల్ హెచ్‌ఎం బేబీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. బాలికలకు ఎటువంటి ఫీజులు ఉండవని టెక్స్ట్, నోట్ బుక్స్ ఉచితంగా ఇస్తామన్నారు. ఈ ఏడాది లెక్చరర్లతో పూర్తిస్థాయిలో బోధన జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని హైస్కూళ్ల హెచ్‌ఎంలు, తల్లిదండ్రులు, పెద్దలు సహకరించి తమ పిల్లలను చేర్పించాలని ఆమె కోరారు.

జోరుగా ఉపాధి హామీ పనులు



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీదేవి

కాళ్ల: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. సోమవారం అమృత్ సరోవర్‌లో భాగంగా గ్రామంలోని పద్మావతి మంచినీటి చెరువులో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. పనులను గ్రామ సర్పంచ్ సాదు శ్రీదేవి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పనులు అంచనా రూ.10లక్షల 30 వేలతో రెండున్నర ఎకరాల్లో 3,713 పనిదినాలు పనిచేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాదు శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద రవికుమార్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: బంటుమిల్లిలో సోమవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం చేశారు. సిద్ధాంత కర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక గ్రంధాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి మనిషి భగవద్గీత చదివి జన్మను సార్థకం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, వాసుదేవా, సత్య నారాయణ, గోపీ, ప్రసాద్, మూర్తి, రాము, శ్రీకర్, సుందర్‌రావు, హనుమంతరావు, తారకేశ్వరి, భానుమతి, శ్రీరేఖ, యశోద, వేంకట లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ జయంత్యుత్సవం



కొప్పర్రులో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పశ్చిమ డెల్టాలో నీటి ఎద్దడిని లేకుండా బ్యారేజీ నిర్మాణం, కాలువలు తవ్వించి రైతులను ఆదుకున్న మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని కొప్పర్రు గ్రామ ప్రముఖుడు, మాజీ సర్పంచ్ చినమిల్లి నరశింహారావు (బాబులు) అన్నారు. సోమవారం కాటన్ జయంత్యుత్సవం సొసైటీ ఆవరణలో నిర్వహించారు. స్థానిక కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబులు మాట్లాడుతూ కాటన్‌ను ఇక్కడి ప్రజలు దేవుడిగా కొలుస్తారన్నారు. రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో చినమిల్లి వీరబాబు, పోలిశెట్టి బాసు, పేరంటాల నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ పారాయణ



పెనుగొండ మూలవిరాట్ ఆలయంలో తెలంగాణ మహిళా సంఘ నాయకులు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో సోమవారం తెలంగాణ మహిళలు వాసవీ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇప్పటి వరకూ 75 ఆలయాల్లో వాసవీ పారాయణ వైభవంగా నిర్వహించినట్లు వారు వివరించారు. సంఘ అధ్యక్షురాలు జూలూరి స్వరూపరాణి ఆధ్వర్యంలో కార్యదర్శి బూరుగు శ్రీలక్ష్మీ, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు లగిసెట్టి రాణి, కార్యదర్శి అర్థం లలిత, కోశాధికారి పాపిశెట్టి రేణుక, నాగర్ కర్నూల్ సంఘ సభ్యులు పారాయణ నిర్వహించారు. ఆశీర్వచనాలు అందించిన పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామిజీ, మూలవిరాట్ ఆలయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం పెంపు



భీమవరం శిబిరంలో మాట్లాడుతున్న వర్మ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



యండగండిలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రామకృష్ణ

సాక్షి, భీమవరం: పట్టణంలోని వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో వివిధ శిక్షణలతో పాటు దేశ నాయకుల, ప్రముఖుల చరిత్రలను బోధించడం మంచి పరిణామమని భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ అన్నారు. సోమవారం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సర్ ఆర్థర్ కాటన్ జయంతి నిర్వహించడం వల్ల బాలలకు కాటన్ చరిత్ర కొంతవరకైనా తెలుస్తుందన్నారు. కాటన్ విదేశీయుడైనప్పటికీ మన ప్రాంత జలవనరులను సక్రమంగా ఆనకట్టలతో సద్వినియోగపరిచిన అపర భగీరథుడని కొనియాడారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు కలిగొట్ల గోపాలశర్మ, డి.రామనాగేశ్వరరావు సర్ ఆర్థర్ కాటన్‌పై రాసిన పద్యాలు ఆలపించారు. అనంతరం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నీతి కథలు, యోగా, నృత్యం వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, శ్యామ్, చెరుకువాడ రంగసాయి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కాళ్ల: ఆకివీడు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన దాసరి సత్యనారాయణ సైన్స్ పాఠాలను విద్యార్థులకు బోధించారు. సంగీతం మాస్టారు కిషోర్ సంగీతం, జనరల్ నాలెడ్జ్‌పై వివరించారు. సతీష్ సహకారంతో మాతృ దినోత్సవం సందర్భంగా తెలుగు భాష ఉన్నతిపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలు తహసిన్, నాగచైతన్య, రేవంత్, సిరి, షణ్ముఖ, రిషితలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు ఆన్‌లైన్‌పై శిక్షణ

ఉండి: వేసవి శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా యండగండి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిబిరంలో మూడు రోజులపాటు బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1వ తరగతి మొదలుకుని విద్యార్థులకు కంప్యూటర్ విద్య, ఆన్‌లైన్ విధానంపై శిక్షణ ఇచ్చారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మూడు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన, వేదిక్ మ్యాథ్స్, ఫోల్డ్‌స్కోప్ వినియోగం దాని ఉపయోగాలు, రోల్‌ప్లే, గేమ్స్ వంటివాటిపై శిక్షణ, అవగాహన కల్పించామన్నారు. అలాగే 10వ తరగతి నుంచి ఆపై తరగతుల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు రెజ్యూమ్ బిల్డింగ్, ఆన్‌లైన్ జాబ్ సెర్చింగ్, ఇంటర్వ్యూ స్కిల్ డెవలప్‌మెంట్స్ తదితర కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారన్నారు. దీంతో విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చూపించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందించినట్లు తెలిపారు. ఫౌండేషన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండ

- వారం నుంచి పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు
- ప్రజలు రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న తుందుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అరుణకుమారి



నిర్మానుష్యంగా ఉన్న గొల్లవానితిప్ప రోడ్డు.



డాక్టర్ జి.అరుణకుమారి

భీమవరం అర్బన్: వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుందుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.అరుణకుమారి అన్నారు. ఎండల తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన సందర్భంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సోమవారం పీహెచ్‌సీలో ఆమె విలేకరులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వడగాల్పులు తీవ్రతరం అవుతున్నాయని, దీంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు నమోదై భానుడు ప్రచండరూపం దాల్చడంతో వేడితోపాటు ఉక్కపోత ఏర్పడుతుందన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణానికే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రతి వేసవిలో వడదెబ్బ తగిలి ఎంతోమంది మృత్యువాత చెందుతున్నారు. వడదెబ్బ తగలకుండా వ్యక్తిగతంగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే రక్షించుకోవచ్చన్నారు. వదులుగా ఉన్న తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. సూర్యకిరణాలు నేరుగా తలపై పడకుండా తెలుపు రంగు టోపి ధరించి వేడిగాలులు తగలకుండా చెవులకు తెల్లటి కాటన్ వస్త్రం కట్టుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ద్విచక్రవాహనంపై ప్రయాణం చేయరాదని, ఒకవేళ వెళితే రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విధిగా ప్రతి 15 నిమిషాలకొకసారి మంచినీరు తాగాలన్నారు. అంతేకాకుండా కొద్ది దూరం ప్రయాణం చేసిన తరువాత నీడలో కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు ఎండలో సంచరించవద్దని సూచించారు.

వడదెబ్బ లక్షణాలు ఇవే

వడదెబ్బ తగిలిన వ్యక్తి చెవుల వెంట వేడిగాలి, కళ్లు వేడిగా ఉండి మసకబారటం, మాట్లాడే టప్పుడు తడబడటం, గుండె వేగం పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. శరీరంలో లవణాలు కోల్పోవడం వల్ల వడదెబ్బ తగులుతుందని వివరించారు.

వడదెబ్బకు గురైతే ఇలా చేయాలి

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లటి ప్రదేశంలోకి తీసుకువెళ్లి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో ఒత్తాలన్నారు. ప్రథమ చికిత్స చేయాలన్నారు. ఉప్పు, పంచాదార, గ్లూకోజ్, ఓఆర్ఎస్ నీటిని అందించాలన్నారు. సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించాలన్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ఎక్కువగా గ్లూకోజ్, కొబ్బరినీళ్లు, బార్లీ, చెరుకు రసం, సబ్జాలు వంటివి విధిగా తీసుకుంటే శరీర ఉష్ణోగ్రత పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని డాక్టర్ అరుణకుమారి చెప్పారు. డ్రింక్స్ తీసుకోవద్దని, శీతల పానీయాలు ఎక్కువగా అమ్ముతారని వాటి జోలికి వెళ్లవద్దని వాటిలో కలిపే కెమికల్ రంగులు ఆరోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

ఈఏపీ సెట్‌కు 1,012 మంది హాజరు



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

సాక్షి, భీమవరం: పట్టణంలో సోమవారం నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఈఏపీ సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, విష్ణు కాలేజ్ ఫర్ విమెన్, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో 1,048 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,012 మంది హాజరయ్యారు.

ఘనంగా దేశాలమ్మ జాతర ప్రారంభం



ఆలయం వద్ద విద్యుద్దీపాలతో అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లాకు సెంటర్ చింతల తోటలో కొలువై ఉన్న దేశాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సంవత్సరం అమ్మవారి ఉత్సవాలు 51వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం నుంచి 21వ తేదీ ఆదివారం వరకూ వారం రోజులు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. లాకు సెంటర్ నుంచి రైల్వే గేటు వరకూ విద్యుద్దీపాలంకరణ, అమ్మవారి చిత్రాలతో బారికేడ్లతో విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి 12 స్టేజీలపై 12 గ్రూపుల కళాకారుల ప్రదర్శనతో అమ్మవారి జాతర ప్రదర్శన నిర్వహించారు. రాత్రి 1 గంట సమయంలో బాణసంచా కాల్చారు. మంగళవారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ వారం రోజులు అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తామని అర్చకులు తెలిపారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి శిడగం సురేంద్ర, కార్యదర్శి గంధం లక్ష్మీనారాయణ, కోశాధికారి అయినాల సత్య సూర్య వరప్రసాద్, అమ్మవారి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పట్టణ వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, శిడగం రామలింగేశ్వరరావు, గొలగాని రమేష్, కొల్లి కొండ ప్రసాద్ తదితరులు ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఆకివీడుకు చెందిన ప్రముఖ యోగా గురువు ఉండ్రమట్ల సాంబశివరావు కెరీర్ గైడెన్స్‌పై చక్కని అవగాహన, ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ మేధావులు అందరూ వారి ఆవిష్కరణలలో మొదట అపజయాలు పొందారని, అపజయం విజయానికి సోపానమని అన్నారు. థామస్ అల్వా ఎడిషన్ జీవిత చరిత్ర ఘట్టాలను విద్యార్థులకు వివరించి, కాలాన్ని సద్వినియోగం చేసుకున్నవారు విజేతలు అయ్యారని, ప్రతి ఒక్కరూ ఆకర్షణా సిద్ధాంతపరంగా మీ లక్ష్యాలను సాధించేవిధంగా మీ ఆలోచనలు ఉండాలని తెలియజేశారు. అనంతరం ధ్యానం చేయించారు. ప్రతిరోజూ ధ్యానం చేయడం వలన ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని తెలియజేశారు. తదుపరి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కాయల వీరాస్వామి, జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు అంగరవేణు, వంగపండు శేఖర్, గంటా పుల్లంరాజు, లక్ష్మీదుర్గ, ఆర్‌కేడీబీ కుమారి పాల్గొన్నారు.

కవురు ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు



కవురు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న పోడూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లు అర్బన్: శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన కవురు శ్రీనివాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పాలకొల్లు నుంచి సోమవారం పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. ముందుగా శ్రీనివాస్‌కి పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్లపై ర్యాలీగా విజయవాడ తరలివెళ్లారు. 2019 సెప్టెంబర్ 2న ఆయన పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో యలమంచిలి జెడ్పీటీసీగా ఘన విజయం సాధించి అత్యంత ప్రతిష్టాత్మకమైన జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని చేపట్టారు. శాసనమండలి ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటా నుంచి కవురు శ్రీనివాస్ ఊహించని రీతిగా పోటీలో నిలిచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విధేయుడిగా నిలిచారు. కరువు శ్రీనివాస్ తాడేపల్లిలో శాసనమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సోమవారం పలువురు నాయకులు తరలివెళ్లారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఎంపీపీలు చిట్టూరి కనకలక్ష్మి, సబ్బితి సుమంగళి, రావూరి వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు, ఆలయాల చైర్మన్లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, గాదె వెంకన్న, జోగి వెంకటేశ్వరరావు, మామిడి బాబు, నంబూరు గంగా పవన్, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్లు ఎం మైఖేల్‌రాజు, పొత్తూరి బుచ్చిరాజు, సచివాలయ కన్వీనర్లు పార్శి వెంకటరత్నం, మద్దాల వాసు, మద్దా చంద్రకళ, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, అడబాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను అభినందించిన నాయకులు

పోడూరు: ఎమ్మెల్సీగా గెలుపొందిన కవురు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారోత్సవానికి సోమవారం పోడూరు మండలం నుంచి అనేక మంది వైఎస్సార్ సీపీ నాయకులు హాజరయ్యారు. తాడేపల్లిలోని శాసన మండలి ప్రాంగణంలో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన కవురు శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి హాజరైనవారిలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీటీడీసీ బాబు, వైస్ ఎంపీపీలు గుబ్బల సత్యనారాయణ, ఇందుకూరి సీతారామరాజు, అల్లు మురళి, వీరవల్లి దుర్గరావు, పోడూరి సత్యసాయిబాబా, బీరా రాజశేఖర్, బొడ్డు బాబి, ముమ్మిడివరపు ఆంజనేయులు ఉన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి



స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు వింటున్న నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ నుంచి మొత్తం 64 ఫిర్యాదులు అందినట్టు సబ్‌కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుల పరిష్కారం అంశానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రతీవారం ఈ కార్యక్రమం ప్రభుత్వ ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్పందన దరఖాస్తుల అంశంపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమస్య పరిష్కారమైన తర్వాత దరఖాస్తుదారుడికి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు దివీస్ ల్యాబొరేటరీస్ సంస్థ నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు 2021, 2022, 2023 సంవత్సరాల్లో డిగ్రీ (కెమిస్ట్రీ), పీజీ (కెమిస్ట్రీ), బీ ఫార్మసీ చేసిన పురుష అభ్యర్థులు అర్హులన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త దుర్గాపురం–1, అంగన్‌వాడీ సహాయకురాలు లంకపేట–1, దిరుసుమర్రు–2, మినీ అంగన్‌వాడీ కార్యకర్త గొంది–1 పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను 23వ తేది సాయంత్రం 5 గంటలలోపు భీమవరంలోని ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

భక్తాంజనేయస్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో భక్తాంజనేయస్వామివారు

పాలకోడేరు: పెన్నాడలోని శ్రీ భక్తాంజనేయ స్వామీ దేవాలయం వద్ద సోమవారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం భక్తులు పండ్ల రసాలతో అభిషేకం చేశారు. తర్వాత అరటి పండ్లతో సహస్రనామ పూజ జరిగింది. సాయంత్రం భగవన్నామ సంకీర్తన జరిగింది. మంగళవారం తేనెతో అభిషేకం, లక్షపత్రి పూజ, తులసి పూజ, అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు నగదు బహుమతులు



ఉత్తమ ఉద్యోగులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తున్న వీరయ్య చౌదరి

భీమవరం (ప్రకాశం చౌక్): ఆర్టీసీ భీమవరం డిపో పరిధిలో ఏప్రిల్ నెలకు సంబంధించి ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారిని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వీరయ్య చౌదరి సోమవారం అభినందించారు. అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు టీటీ రావు, ఆర్ఆర్‌కే రాజు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు సీహెచ్ వీవీఎస్ నారాయణ, సీహెచ్ కల్యాణ్, జేహెచ్ఎస్ ప్రసాద్‌లను ప్రశంసాపత్రాలు ఇచ్చి అభినందించారు. వీరికి రూ.500, రూ.400, రూ.300 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 28 మంది ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పారావు

నరసాపురం: వైఎన్ కళాశాలలో హెచ్ఆర్‌డీ సెంటర్ ఆధ్వర్యంలో దివీస్ ల్యాబొరేటరీస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 28 మంది ఉద్యోగాలు పొందినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏపీవీ అప్పారావు చెప్పారు. బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా మొత్తం 28 మంది ఉభయగోదావరి జిల్లాల నుంచి హాజరయ్యారు. దివీస్ ల్యాబొరేటరీస్ హెచ్ఆర్ మేనేజర్ రాజేష్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ ఫార్మారంగంలో ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. హెచ్ఆర్‌డీ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలలోని హెచ్ఆర్‌డీ సెంటర్ ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. అనేక కంపెనీల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు.